ప్రజాశక్తి
శుక్రవారం 19 సెప్టెంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిర్వాసితుల గోడు పట్టదా ?

◆ అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో రైతులు బలి ◆ టిడిఆర్‌లపై తీవ్ర నిరసన

◆ ఫార్మా, ఇతర కంపెనీలకు లాభం చేకూర్చమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు..



విఎంఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన నిర్వాసితులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తమది 'రైతుల పక్షపాతి ప్రభుత్వం' అంటూ నిత్యం సుభాషితాలు వల్లించే టిడిపి కూటమి సర్కారు అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితుల పట్ల మొండిగా వ్యవహరిస్తోంది. వారి గోడును అస్సలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక జిల్లా అధికార యంత్రాంగం మరింత దూకుడుగా వెళ్తూ రైతన్నలకు, సామాన్యులకు తీరని వేదనను మిగులుస్తోంది.

ఈ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన వివాదం నెలల తరబడి నడుస్తోంది. తాము కోల్పోతున్న భూములకు చట్ట ప్రకారం నగదు రూపంలో ఇవ్వాల్సిన పరహారానికి బదులుగా టిడిఆర్ బాండ్లు ఇవ్వడంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేవలం ఫార్మా, ఇతర కంపెనీల కోసం సాగే ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇప్పించడంలో జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు చొరవ చేయడం లేదు. కూటమి నేతలకు ఈ సమస్య పట్టడం లేదు. ఇదే రోడ్డులో షాపులు కోల్పోయిన వ్యాపారులకు రూ.15 కోట్లు పరిహారాన్ని ఇచ్చి, భూములు కోల్పోయే రైతులకు ట్రాన్సఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టిడిఆర్)లు ఇవ్వడంపై రైతులు భగ్గుమంటున్నారు. వాటిని తాము ఏం చేసుకోవాలంటూ ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు విస్తరణలో లాభమెవరికి ? నష్టమెవరికి ?

అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డుకిరువైపులా సుమారు 14 కిలోమీటర్ల పొడవున (4 లేన్‌లు) 100 అడుగుల విస్తరణకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కొద్దికాలం క్రితం శ్రీకారం చుట్టింది. సుమారు 1196 మంది రైతులు 250 ఎకరాలకుపైగా కోల్పోవాల్సి వస్తోంది. ప్రభుత్వం అందుకుగానూ నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించడానికి ససేమిరా అనడం ఇక్కడ వివాదంగా మారి స్థానిక రైతుల నిరంతర నిరసనలకు కారణమైంది. నిజానికి ఈ రహదారి విస్తరణ వల్ల స్థానిక ప్రాంతాల ప్రజలకుగానీ, రైతాంగానికిగానీ పెద్ద ప్రయోజనమేమీ మిగతా 2లో..



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు

కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్

ఈ నెల 22, 23వ తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులతో సమీక్షించిన ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. వికసిత్ భారత్, సివిల్ సర్వీస్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ పేరిట రెండు రోజుల పాటు స్థానిక నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే ఈ సదస్సులో ఆరు ప్లీనరీ, ఆరు బ్రేక్ అవుట్ సెషన్లు జరగనున్నాయని, దేశం నలుమూలల నుంచి వెయ్యి మంది వరకు అతిథులు, ఐటి రంగ నిపుణులు, ఎపి సిఎంతో పాటు కేంద్ర, రాష్ట్రాల ఐటి శాఖ మంత్రులు భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు ముందుగానే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సదస్సు నేపథ్యంలో జిల్లాలోని వివిధ విభాగాల అధికారులతో కూడిన 13 ప్రధాన కమిటీలు, మరొక 10 ఉప కమిటీలు వేయగా ఆయా కమిటీలు నిర్వర్తించాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. అధికారులు, ప్రయివేటు ఏజెన్సీలు సమన్వయంతో పని చేయాలని, సదస్సును విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ నిర్దేశించారు. ఆర్గనైజింగ్ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ నేతృత్వం వహిస్తున్నారని, భద్రతా కమిటీకి పోలీస్ మిగతా 2లో..

ఉపాధ్యాయ సమస్యలపై 'రణభేరి'

▶ వార్త 8లో..

మహిళ హత్య కేసులో నిందితుని అరెస్ట్

▶ వార్త 3లో..

చిరు బతుకులపై దాడి

▶ వార్త 4లో..

మెరైన్ పార్క్ ప్రారంభం

100 అడుగుల హైమాస్ట్ పతాకానికి శంకుస్థాపన



పార్కులో పర్యటిస్తున్న అంగముత్తు, అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2.7 కోట్లు వ్యయంతో నిర్మించిన మెరైన్ పార్క్‌ను పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు గురువారం కాన్వెంట్ జంక్షన్ వద్ద ప్రారంభించారు. వంద అడుగుల ఎత్తైన హైమాస్ట్ జాతీయ పతాకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్ట్‌తో పాటు నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. రాత్రివేళలలో పోర్టు ప్రాంతం అందంగా కనిపించేలా లైటింగ్ స్ట్రిప్స్ ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నామన్నారు. మెరైన్ పార్క్‌లో యాంకర్, స్టార్ ఫిష్, డాల్ఫిన్స్, సముద్రపు గవ్వ వంటి ప్రకాశించే శిల్పాలను అందమైన మొక్కల మధ్య సుందరమైన మార్గం ఇరువైపులా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్, పలు విభాగాల అధిపతులు, అధికారులు, పోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖలోనే ఇఎస్ఐ మెడికల్ కాలేజీ నిర్మించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇఎస్ఐ మెడికల్ కాలేజీని విశాఖలోనే నిర్మించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇఎస్ఐ ఇన్సూరెన్స్ కమిషనర్ ఢిల్లీ నుంచి వచ్చి మంగళవారం విజయవాడలో మాట్లాడుతూ ఇఎస్ఐ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీని అమరావతిలో త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ అమరావతిలోనే పెట్టించాలనే చంద్రబాబు ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం తలొగ్గి అమరావతిలో ఇఎస్ఐ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా 14 లక్షల మంది ఇఎస్ఐ సభ్యులు ఉన్నారని, విశాఖలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం తుది దశలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హాస్పటల్ ఆల్ ఇండియా మెడికల్ సైన్స్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

(ఎఐఎంఎస్) అమరావతి వద్ద ఉన్న మంగళగిరిలో ఏర్పాటు చేయబడిందని చెప్పారు. కార్మికులు అత్యధిక మంది ఉన్న విశాఖపట్నంలో కాకుండా అమరావతిలో మెడికల్ కాలేజీ పెట్టడం సరైంది కాదని నర్సింగరావు అన్నారు. ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం అవుతున్న దగ్గరే మెడికల్ కాలేజీ కూడా ఉండాలని, దానికి భిన్నంగా ఇఎస్ఐ మెడికల్ కాలేజీని అమరావతికి బదలాయించడం సరైంది కాదని అన్నారు. ముఖ్యమంత్రి కేవలం అమరావతిలోనే అభివృద్ధి జరగాలనే విధానం పాటిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతే కాదని తెలిపారు. ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నిర్వాసితుల గోడు పట్టదా ?

ఉండదు. అనకాపల్లి-అచ్యుతాపురం మధ్య ప్రతి రోజూ 600కుపైగా ఫార్మా కంపెనీల బస్సులే ప్రయాణం చేస్తుంటాయి. ఆయా కంపెనీల వారికి మాత్రమే ప్రయోజనం. ఈ రోడ్డు వెంట వెళితే పూడిమడక సముద్రమే వస్తుంది. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన వ్యాపారులకు రూ.15 కోట్లు మేర పరిహారాన్ని వివిఎంఆర్‌డిఎ పిసిపిఐఆర్ విభాగం ద్వారా ఆర్ అండ్ బి అధికారులు అందించారు. తదుపరి రైతులను గాలికొదిలేశారు. వాస్తవానికి వందల ఎకరాలు రైతులు, స్థానిక నివాసితులవి పోతున్నప్పుడు నష్టపరిహారాన్ని నగదు రూపంలో కంపెనీల నుంచే రాబట్టవచ్చు. కానీ స్థానిక జనసేన ఎంఎల్ఎ ఈ వ్యవహారంలో తలదూర్చి టిడిఆర్‌లకు రైతులను ఒప్పించడం ద్వారా కంపెనీలకు ప్రయోజనం చేసే యత్నాల్లో నిమగ్నం కావడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆయన తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారమివ్వాలి

2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారమివ్వాలి. నిర్వాసితుల పట్ల అధికార యంత్రాంగం తీరు సరికాదు. విఎంఆర్‌డిఎ నిర్వహించిన గ్రామ సభల్లో స్థలాలు, ఇల్లు, దుకాణాలకు టిడిఆర్‌లు వద్దని చెప్పాం. ఈ విషయమై మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించాం. గత ప్రభుత్వం కంటే భూ నిర్వాసితులకు ఎక్కువ లాభం చేస్తామని చెప్పి నష్టం చేస్తున్నారు. బాధితుల పక్షాన సిపిఎం తొలినుంచీ పోరాడుతోంది.

ఆర్.రాము,
సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్

పరిహారం ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేపట్టొద్దు

వ్యాపారులకు నష్టపరిహారం ఇచ్చి రైతులకు టిడిఆర్‌లు ఇవ్వడం ఏమిటి?. ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదు. పరిహారం ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేపడితే పనులు సాగనివ్వం.

- సదాశివరావు, రైతు

విశాఖలోనే ఇఎస్ఐ మెడికల్ కాలేజీ నిర్మించాలి

హెచ్చరించారు.

విశాఖలోని షీలానగర్‌లో 2016లో ఆనాటి కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇఎస్ఐ 400 పడకల హాస్పిటల్‌కు శంకుస్థాపన చేశారని, 2022 వరకూ నిర్మాణాలు జరగలేదని అన్నారు. ఇఎస్ఐ బోర్డులో ఒత్తిడి చేయడం వల్ల 2022 నుంచి నిర్మాణం సాగుతోందని తెలిపారు. ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం షీలానగర్ వద్ద ముగింపు దశలో ఉందన్నారు. దీనికి అనుబంధంగా ఇఎస్ఐ మెడికల్ కాలేజీని కూడా విశాఖలోనే నిర్మించాలన్నారు. మల్కాపురంలో ఇఎస్ఐ ఆసుపత్రి ఉందని, అక్కడ అవసరమైనంతమంది వైద్యులు లేరని తెలిపారు. ల్యాబ్ సదుపాయం కూడా లేదని చెప్పారు. ఈ రెండింటినీ సమకూర్చాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు

కమిషనర్ శంఖబ్రత బాగ్చీ నేతృత్వం వహిస్తున్నారని వివరించారు. వీరితో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా కమిటీల్లో ఉంటారని, వారితో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, శానిటేషన్ చర్యలు చేపట్టాలని, సదస్సుకు సంబంధించిన హోర్డింగులు విరివిగా పెట్టాలని చెప్పారు. విమానాశ్రయం, రైల్వే స్టేషన్, హోటళ్ల వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో, గాలా డిన్నర్ ఏర్పాటులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైజన్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని, లోపాలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, డిసిపి అడ్మిన్ కృష్ణకాంత్ పాటిల్ పాల్గొన్నారు.

కార్మికుల అకౌంట్ల మార్పు తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పారిశుధ్య కార్మికుల అకౌంట్లను ఎస్‌బిఐ నుంచి యాక్సిస్ బ్యాంకుకు మార్చే ప్రసక్తి లేదని, పర్మినెంట్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు యాక్సిస్ బ్యాంకుకు ఖాతాలను మార్చుకోవద్దని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ ఎస్‌బిఐలోని కార్మికుల అకౌంట్లను ప్రైవేటు యాక్సిస్ బ్యాంకులోకి మార్చడానికి సిఐటియు వ్యతిరేకమని పేర్కొన్నారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో యాక్సిస్ బ్యాంక్ అధికారులకు, జివిఎంసి అధికారులకు వారు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అకౌంట్ల మార్పును క్షణాల మీద అమలు చేయడానికి అధికారులు చూపుతున్న ఉత్సాహం కార్మికుల సమస్యల పరిష్కారంలోగానీ, ఒప్పందాల అమలు విషయంలోగానీ కానరావడం లేదన్నారు. ఎస్‌బిఐ సేవలు ఎక్కడికక్కడే అందుబాటులో ఉన్నాయన్నారు. యాక్సిస్ బ్యాంకుకు మారితే కార్మికులు భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని సోదాహరణంగా వివరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం దారుణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పాడేరులో ఈ నెల 19న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆశీలమెట్ట కార్యాలయంలో గురువారం దక్షిణ వైసిపి శ్రేణులతో కలిసి ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, అందుకోసం పిలిచిన టెండర్లను ఓపెన్ చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపజేసే దిశగా ఉందని విమర్శించారు. ఈ సంవత్సరం రూ.724.4 కోట్ల లాభాలను సొంతం చేసుకున్న విశాఖపట్నం పోర్టు రూ.171 కోట్లను పన్నుల రూపేణా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించినట్టు తెలిపారు. అయినప్పటికీ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటుకు అప్పగించాలని చూడటం దారుణమన్నారు.



నిరసన తెలుపుతున్న పోర్టు కార్మికులు

ప్రజలకు, కార్మికులకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ హాస్పిటల్‌ను కేవలం లాభాల కోసం ప్రైవేటుకు అప్పగించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటుపరమైతే 40 వేల కుటుంబాలకు ఆరోగ్య సేవలు దూరమవుతాయని తెలిపారు. ఒక సంవత్సర సిఎస్ఆర్ నిధులు కేటాయించినా ఆసుపత్రి అభివృద్ధి పథంలోకి వెళ్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, ఎల్లారావు, శ్రీను, ఈశ్వరరావు, గణేష్, శంకరరావు, రాఘవులు పాల్గొన్నారు.

స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలి

20, 21న సర్వీసులు బంద్ - 22న చలో కలెక్టరేట్
ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బి.జగన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 20, 21 తేదీలలో నగరంలో సర్వీసులు బంద్ చేపడుతున్నామని, 22న చలో కలెక్టరేట్, 24న ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ తెలిపారు. గురువారం సిఐటియు జగదాంబ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైడర్ల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం ఆగదన్నారు. విశాఖ జిల్లాలో ఏడు సంవత్సరాలుగా స్విగ్గీ, జొమాటో ప్లాట్‌ఫారాల్లో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లకు ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రతా లేవన్నారు. రోజు రోజుకూ పెరిగిపోతున్న జీవన ఖర్చులు, పెట్రోల్ ధరలు, అనిశ్చితమైన ఆదాయం కారణంగా వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అక్రమంగా తొలగించిన రైడర్ల ఐడిలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మినిమం గ్యారెంటీ వేతనం, ఆదాయం అమలు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కె.కుమార్ మంగళం, సంఘం నాయకులు అచ్యుత్, నాని, రమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్ కాస్మోటాలజీకి లేజర్ యంత్రం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ డెర్మటాలజీ విభాగానికి రూ.45 లక్షల విలువగల క్యూ స్విచ్డ్, ఎన్‌డి వైజిలేజర్ లేజర్ యంత్రాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులను పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్స్ ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ డివిఎల్ డిపార్టుమెంట్ ద్వారా ప్రభుత్వం సమకూర్చిందని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ సందర్భంగా వారికి డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆధునిక లేజర్ యంత్రం ద్వారా మంగు మచ్చలు, వివిధ కారణాల వల్ల చర్మంపై ఏర్పడే మచ్చలను శస్త్ర చికిత్స అవసరం లేకుండా తొలగించవచ్చునన్నారు.

జివిఎంసిలో పలువురికి ఉద్యోగోన్నతి

ఎంవిపి.కాలనీ : సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో జివిఎంసిలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 21 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి ఉత్తర్వులను అందజేశారు.

20న బహుముఖ పోటీలు

ప్రజాశక్తి- ఆనందపురం : మహాకవి గురజాడ అప్పారావు జయంతి ఈ నెల 21వ తేదీని పురస్కరించుకుని మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు పి.త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగనున్నాయి. వ్యాసరచన, "దేశమును ప్రేమించుమన్నా" పాటల పోటీలు బాలుర, బాలిక విభాగాలలో వేర్వేరుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు గురజాడ జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులందరూ పోటీలలో పాల్గొనవచ్చని, వివరాలకు 7893963129, 9182467217 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రావెల్ తరలింపుతో ప్రమాదంలో శ్మశాన ప్రహరీ

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి నగరంపాలెం శ్మశానం గోడకు అనుకొని గ్రావెల్ తవ్వడం వల్ల ప్రహరీ కూలే ప్రమాదముందని అధికారులకు సిపిఐ నాయకుడు మరుపల్లి పైడిరాజు ఫిర్యాదు చేశారు. నగరపాలెం సచివాలయం నుండి వాంబే కాలనీ మీదగా మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించి ముందుగా మట్టిరోడ్డు తయారు చేస్తున్నారు. ఐతే ఈ రోడ్డు నిర్మాణం కోసం పక్కనే ఉన్న నగరంపాలెం శ్మశానం ప్రహరీని అనుకుని జెసిబిలతో గ్రావెల్ తవ్వి ఆ రోడ్డు నిర్మాణం పనులకు వినియోగిస్తున్నారని, దీనివల్ల ప్రహరీ కూలిపోయే ప్రమాదం ఉందని వివరించారు. ప్రహరీ పాడవకుండా అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయిలో గీతం ఎన్‌సిసి కేడెట్‌ల ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌సిసి కేడెట్లు జాతీయ స్థాయిలో భారత నౌకాదళం నిర్వహించిన పలు పోటీలలో ప్రతిభను చాటారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇసిఇ తృతీయ సంవత్సరం విద్యార్థి చెల్లా శివశంకర్ జాతీయ స్థాయిలో లోనావాలాలో ఇటీవల జరిగిన నౌ సైనిక్ శిబిరంలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్‌లకు ప్రాతినిధ్యం వహించారు. జాతీయ స్థాయిలో 17 ఎన్‌సిసి డైరెక్టరేట్‌ల నుంచి హాజరైన ఎన్‌సిసి కేడెట్‌లతో పోటీ పడి బోట్ పుల్లింగ్, సీమాఫోర్, డ్రిల్, సర్వీస్ విభాగాలలో విజేతగా నిలిచి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచాడు. ఒడిశాలోని భారత నౌకాదళ స్థావరం ఐఎన్ఎస్ చిల్కలో జరిగిన అఖిలభారత యాటింగ్ రెగెట్టా పోటీలలో గీతం ఎన్‌సిసి కేడెట్లు ప్రతిభను చాటారు. ఈ పోటీలలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ బిసిఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని విశాఖ సింగ్ ప్రథమ స్థానాన్ని, సిఎస్ఇ తృతీయ సంవత్సరం విద్యార్థి అడబాల దీపక్ ద్వితీయ స్థానం సాధించారు.

ఇటీవలే గీతం ఎన్‌సిసి విద్యార్థి వినీల్ దీక్షిత్ ప్రతిభను గుర్తిస్తూ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బి) ఈ ఏడాది ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ కింద ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణకు ఎంపిక చేసింది. శిక్షణ అనంతరం భారత రక్షణ దళాలలో ఆఫీసర్ కేడర్‌లో పని చేసే అవకాశం వినీల్ దీక్షిత్‌కు లభించనుంది. గీతం విద్యార్థుల ప్రతిభను గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్‌సిసి అధికారులు అభినందించారు.

పరిశుభ్రతపై పోస్టల్ సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి- ఆనందపురం : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పోస్టల్ విభాగం గొట్టిపల్లి బ్రాంచ్ ఆఫీస్ సౌజన్యంతో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నార్త్ సబ్ డివిజన్ అధికారి జి.జగదీశ్వరరావు నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో పోస్టల్ సిబ్బంది, గ్రామ ప్రజలు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా నుక్కడ్ నాటక్ ప్రదర్శించి పరిశుభ్రత ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేశారు. అనంతరం సబ్ డివిజన్ అధికారి జగదీశ్వరరావు గ్రామస్తులకు, విద్యార్థులకు పోస్టల్ ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో బిపిఎం నూర్జహాన్, ఎబిపిఎం డబ్బీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కోరాడ వెంకట నరసింహనాయుడు, ఇన్‌ఛార్జ్ హెచ్ఎం వి.శ్రీనివాసరావు, విలేజ్ పోలీస్ రామలక్ష్మి, శ్రీసత్యసాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయకుమార్, కో-కన్వీనర్ డిపి.రాజు, రెడ్డిపల్లి సబ్ ఆఫీస్ పరిధి బిపిఎం, ఎబిపిఎంలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-సీతమ్మధార : వార్డులలో పారిశుధ్య పనుల నిర్వహణ సరిగా లేదని శానిటేషన్ అధికారులపై జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 47వ వార్డు పరిధి కప్పరాడ, తాటిచెట్లపాలెంలోని అన్నక్యాంటీన్ తదితర ప్రాంతాలలో గురువారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వార్డులలో వ్యర్థాలు రోడ్లు, కాలువలపై అస్తవ్యస్తంగా కనబడుతున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 260, 270 వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులు నందకిషోర్, ఝాన్సీల మొబైల్ ఫోన్ ద్వారా ముఖ గుర్తింపు హాజరును పరిశీలించి, పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కాలువలు దాటి రోడ్లపై ఉన్న దుకాణాలను వెనక్కి తరలించాలని ఆదేశించారు.

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ ఎమ్‌డి మృతి

ప్రజాశక్తి -పద్మనాభం : భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ ఎమ్‌డి ఎస్‌విఎస్ఎన్.రాజు (93) వృద్ధాప్యంతో గురువారం మృతిచెందారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ మధురకురపల్లి గ్రామానికి చెందిన రాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘం ఎమ్‌డిగా సేవలందించారు. బంధువులు, గ్రామస్తులు, పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

పలుచోట్ల స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్



గాయత్రి మెడికల్ కాలేజీలోస్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో పాల్గొన్న వైద్యులు

ప్రజాశక్తి- యంత్రాంగం

స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను గురువారం పలుచోట్ల నిర్వహించారు. వైద్య శిబిరాలు నిర్వహించి తనిఖీలు చేశారు. ఈ శిబిరాల్లో మాతా-శిశు సంరక్షణతో పాటు టీబీ, మలేరియా, మధుమేహం, రక్తపోటు, అంటువ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు.

ఆనందపురం: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపిపి శారదా ప్రియాంక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, డాక్టర్ జానకి, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సబీనా భాను, నాయకులు కోరాడ రాజబాబు, మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

కొమ్మాది : గాయత్రి మెడికల్ కళాశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 16 రోజులు మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు త్రిషి, సురేష్, హాస్పిటల్ డీన్ సుబ్బారావు, వరప్రసాద్, జివిపి సెక్రటరీ డాక్టర్ సోమరాజు పాల్గొన్నారు.

వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి పురుషోత్తపురంలోని యుపిహెచ్‌సిలో 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దీపిక, పద్మజ, పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్ష్మి గోవింద్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురంలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు

సీతమ్మధార : స్వస్థ్ నారీ -సశక్త్ పరివార్ అభియాన్ మెడికల్ క్యాంపులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పరిశీలించారు. ఎంఎస్ఆర్, పిఠాపురం కాలనీల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. స్త్రీలకు కేన్సర్ స్క్రీనింగ్, వ్యాధి నిరోధక టీకాలు, సికిల్ సెల్ ఎనిమియా, పోషణ తదితర విషయాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి డిఎం అండ్ హెచ్ఓ చెప్పారు. ఈ క్యాంపుల్లో అభ ఐడి గుర్తించాలని, ఇహెచ్ఆర్ నమోదు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్శనలో డాక్టర్ బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు: మండలంలోని లంకవానిపాలెం పిహెచ్‌సిలో రాష్ట్రీయ 8వ పోషణ మహోత్సవ్, స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. కె.కోటపాడు సిడిపిఒ లలితకుమారి, పిహెచ్‌సి డాక్టర్ శైలజా సురేష్ కుమార్ పాల్గొన్నారు. మహిళలకు ఉచిత వైద్యసేవలు కేన్సర్ స్క్రీనింగ్, శుభకాయం అనర్థాలు, పోషకాహారం, మాతృత్వ వందన యోజన పథకాలపై అవగాహన కల్పించారు.

బుచ్చయ్యపేట : దిబ్బిడి గ్రామంలో వైద్యాధికారి కె.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఎంపిటిసి గొంపా చినబాబు, మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాసరావు, పెదిరెడ్ల రాజు, రామకృష్ణ, బి దేముడు, ఎం రామకృష్ణ పాల్గొన్నారు

సబ్బవరం : స్థానిక పిహెచ్‌సిలో మహిళలు, బాలికలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్ఎస్ఆర్.చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి డిఐఒ చంద్రశేఖర్ దేవ్, సబ్బవరం సర్పంచ్ దెడ్డెం ప్రసాదరావు, నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు,డాక్టర్ ఆశ, డాక్టర్ విద్యాధరి, డాక్టర్ కుసుమ కుమారి, సిహెచ్ఒ స్వర్ణలత ఎంపిహెచ్ఒ జేసుదాసు, అప్పల నరసమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మండలంలోని చెట్టుపల్లి గ్రామ సచివాలయం వద్ద మహిళలు, గర్భిణీలకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, వైస్ ఎంపీపీ రత్నం రమణ, రెల్లి సంఘ సీనియర్ నాయకులు ఎర్రం శెట్టి పాపారావు, నాయకులు మోపాడ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని రేబాక, వేంపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వేంపాడులో ఆయుష్ వైద్యాధికారి కె.రఘు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి పాత మధురవాడ చైతన్యపురి కాలనీలో పోతిన అప్పలరాజు రెండంతస్తుల భవనం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ దగ్ధమయ్యాయి.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం కుసులువాడ సమీపంలో ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. చందక పంచాయతీ జగన్నాధపురం, నిమ్మలవారి కల్లాలకు చెందిన ఎర్ర గౌరినాయుడు (39) ఆటోపై కుసులవాడ నుండి వస్తుండగా తీగలవాని చెరువు వద్ద కుక్కను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గౌరినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య జయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆనందపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ సంతోష్ దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత కన్నూరుపాలెం గ్రామ పరిసర ప్రాంతాలలో కోడిపందేల శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.5,120 నగదు స్వాధీనం చేసుకున్నారు సిఐ. ఎ.స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్.ఐ. పి.మనోజ్ కుమార్, హెచ్.సి. సూర్యారావు, కానిస్టేబుళ్లు రామిరెడ్డి, మహేష్, శ్రీను, అప్పలరాజు దాడుల్లో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని చౌడువాడ గ్రామంలో గురువారం విద్యుతఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే గ్రామంలో ఏపీ ట్రాన్స్కో కు సంబంధించి 220కెవి విద్యుత్తు లైన్ కింద గల వెదురు చెట్టును తొలగిస్తుండగా షాక్‌కు గురై రాయి నాగేశ్వరరావు మృతి చెందాడు. పక్కనే ఉన్న గరగ నాగేశ్వరరావు తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన బాధితుడిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు,

మహిళ హత్య కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలమ్మ పాలెం పంచాయితీ జాలరిపేటలో మహిళా హత్య కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 17న ముత్యాలమ్మపాలెం విఆర్ఓ చెవ్వేటి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తెలిపిన వివరాలివి.. జాలరిపేట గ్రామానికి చెందిన వొలిశెట్టి కోదండ, తనతో సహజీవనం చేస్తున్న శ్రీకాకుళం జిల్లా అమదాలవలసకు చెందిన లక్ష్మి (45)ని ఈనెల 17న ఉదయం గొడవపడి, దాడి చేసి హత్యచేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తు క్రమంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు వెన్నెలపాలెం సినిమా హాల్ జంక్షన్ వద్ద నిందితుడిని పరవాడ సిఐ ఆర్. మల్లికార్జునరావు సిబ్బందితో కలిసి పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడిని న్యాయపరమైన ప్రక్రియల అనంతరం 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఎదుట హాజరు పరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక కృష్ణాకాలనీ 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 20వ తేదీన పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్-3 ఇఇ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి 3, 4 వార్డుల పరిధిలో భీమిలి, స్మిత్ స్ట్రీట్, అప్పికొండ వీధి, బ్యాంక్ కాలనీ, నేరెళ్లవలస, జెవి.అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాది సబ్ స్టేషన్ 11కెవి ఫీడర్‌పై మరమ్మతులు, లైన్లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించే పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు జోన్ 3 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో కొమ్మాది విలేజ్, దేవిమెట్ట విలేజ్, సేవానగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఓజోన్ వేలీ బ్లాక్స్, డిఒజి కంపెనీ లే-అవుట్, ఓజోన్ వేలీ రోడ్, మారికవలస మెట్రో, చైతన్య క్యాంపస్, పొలాక్ స్కూల్, గురుకుల కళాశాల ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

ప్రజాశక్తి -గాజువాక : అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును తక్షణమే రద్దుచేయాలని పెదగంట్యాడ తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. పెదగంట్యాడ ఏరియా సర్వే నంబరు 97, 98, 99, 101లో అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేశారని తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే 300 మందికి ఉపాధి ఉండొచ్చు కానీ స్థానిక 50 వేల మంది ప్రజలు అనారోగ్యంపాలవుతారని తెలిపారు. గర్భిణులు, చిన్న పిల్లలకు కేన్సర్ సోకే అవకాశాలు ఉన్నాయని వివరించారు. దుమ్ము, ధూళి కాలుష్యం పెరుగుతుందన్నారను. అక్టోబర్ 8వ తేదీన పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు హాజరుకావాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు డి.వెంకటరావు, నమ్మి రమణ, పాల్ శ్రీను, అప్పలరెడ్డి, కణితి అప్పలరాజు, వై.అప్పలరాజు, శ్రీను, అప్పలరాజు ఉన్నారు.

గంజాయి, మద్యం అరికట్టాలి

ప్రజాశక్తి -ములగాడ : గంజాయి, మద్యం మత్తులో పెట్రేగిపోతున్న యువతను అరికట్టాలని ములగాడ గ్రామ ప్రజలు పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 58వ వార్డు పరిధి చిన్నములగాడలో రోజూ సాయంత్రం 6 నుంచి 12 గంటల వరకు గ్రామంలో గంజాయి, మద్యం తాగుతూ స్థానికుల్ని డబ్బుల కోసం వేధిస్తున్నారని వివరించారు. తమ గ్రామానికి రక్షణ కావాలంటూ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని మహిళలుకోరారు. ద ఇండియన్ మహిళా ఫౌండేషన్ సహకారంతో గ్రామ మహిళలు వినతి పత్రాలు అందించారు. గ్రామంలో నాలుగు అనధికార మద్యం దుకాణాలు, కిరాణా షాపు ప్రాంగణాలే ఆకతాయి యువతకు ఆవాసాలుగా ఉంటున్నాయని, గ్రామం నగర శివారులో ఉండడంతో చుట్టుపక్క గ్రామాల్లో ఉన్న యువత ఇక్కడికి వచ్చి ఉద్రిక్తత వాతావరణం సృష్టిస్తున్నారు జివిఎల్.పద్మ వివరించారు. మద్యం వ్యాపారులు, ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన పోలీస్ కమిషనర్ వెంటనే ఆయా పోలీస్ స్టేషన్లకు సమాచారం తెలిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రిటర్నింగ్ వాల్ పనుల పరిశీలన



ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి త్రినాథపురం గ్రామంలో ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు (గణబాబు) చొరవతో సుమారు రూ.8 లక్షల వ్యయంతో జరుగుతున్న రిటర్నింగ్ వాల్ పనులను వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి మాలినాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాలినాయుడు మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, ఎమ్మెల్యే చొరవతో రిటర్నింగ్ వాల్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, శ్రీధర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

బేస్ బాల్ క్రీడా జట్టు ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన స్థానిక జివిఎంసి మినీ స్టేడియంలో జిల్లా స్థాయి 14 ఏళ్ల లోపు బేస్ బాల్ క్రీడా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక కేథరిన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ పోటీలకు ఆసక్తి గల 14 ఏళ్ల లోపు బాల బాలికలు హాజరుకావచ్చని కేథరిన్ విద్యా సంస్థల అధినేత ఆలివర్ రాయి గురువారం తెలిపారు.

అనంతుని హుండీ ఆదాయం రూ.2.44 లక్షలు

ప్రజాశక్తి పద్మనాభం : పద్మనాభంలోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయం హుండీని కొండ దిగునవన్న కుంతీ మాధవ ఆలయంలో ఈవో నానాజీ బాబు ఆధ్వర్యాన గురువారం లెక్కించారు. గత ఏడాది డిసెంబర్ 2 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 18వ తేదీ వరకు కొండపైన, దిగువన ఉన్న హుండీలను లెక్కించగా రూ.2,43,988 వచ్చిందని తెలిపారు. ఈ మొత్తాన్ని బ్యాంకు దేవాలయం ఖాతాలో జమ చేశారు.

చిరు బతుకులపై దాడి

- రోడ్డున పడ్డ వీధి వ్యాపారులు
- ఆక్రమణల పేరిట తొలగింపులు
- అధికారుల వైఖరిపై నిరసనలు



మిథిలాపురి ఉడా కాలనీలో తోపుడు బళ్లు, దుకాణాలను తొలగిస్తున్న జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

చిరు వ్యాపారులపై అధికారులు పంజా విసిరారు. నగరంలో పలుచోట్ల రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఆక్రమణలంటూ గురువారం తొలగింపులు చేపట్టారు. దీంతో వీధి వ్యాపారులు రోడ్డున పడ్డారు. పలుచోట్ల నిరసన తెలిపారు.

మధురవాడ : మిథిలాపురి వుడా కాలనీ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, తోపుడు బళ్లను జివిఎంసి జోన్ -2 పట్టణ ప్రణాళిక అధికారులు గురువారం తొలగించారు. పట్టణ ప్రణాళిక టిపిఒ శ్రీలక్ష్మి, ఎసిపి శబ్బం శాస్త్రి ఆధ్వర్యాన ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తొలగింపులు చేపట్టారు.

తోపుడు బళ్ల వర్తకుల నిరసన

మిథిలాపురి వుడా రోడ్డులో అధికారులు బడ్డీలను తొలగించడంతో అక్కడ రోడ్డుపై చిరు వ్యాపారులు సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడ్డీల తొలగింపుతో తమ బతుకు తెరువుపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు.

చిరు వ్యాపారులపై దాడి దుర్మార్గం : సిఐటియు

తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల దుకాణాలను తొలగించి, వారు ఆర్థికంగా నష్టపోయేలా చేయడం దుర్మార్గమని సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు అమానుషంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. అప్పులు చేసి తెచ్చుకున్న సామాన్లు మొత్తం చిందర వందర చేసారని, పరికరాలను విరగొట్టి పనికి రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దాడిలో నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రాస్తారోకో కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజుకుమార్, ఆదినారాయణ, కె.రాంబాబు, శ్రీను, కామేశ్వరరావు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను జివిఎంసి ఒకటో జోన్ అధికారులు తొలగించారు. పోలీసు బందోబస్తు తీసుకుని, యంత్రాల సాయంతో రాములమ్మ థియేటర్ నుంచి తాతా థియేటర్, వై జంక్షన్, అండర్ పాస్ వరకు రోడ్డుకు ఇరువైపులా షాపులను తొలగించారు. దీంతో రోడ్డు పక్కన బతుకు తెరువు కోసం తోపుడు బళ్లు, తట్టల్లో పెట్టుకొని పండ్లు అమ్ముకుంటున్న వారు బోరున విలపిస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నారు.

సీతమ్మధార : నగరంలో ఆర్‌టిసి కాంప్లెక్స్, సీతంపేట, గురుద్వారా, శాంతిపురం, శంకరమఠం, కంచరపాలెం, ఓల్డ్ ఐటిఐ జంక్షన్, అక్కయ్యపాలెం, నరసింహనగర్ ప్రాంతాలలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బడ్డీలు తొలగించారు. బడ్డీలు పెట్టుకొని బతుకుతున్న తమపై ప్రతాపం చూపడాన్ని నిరసిస్తూ చిరు వ్యాపారులు ఆందోళన చేపట్టారు. బడ్డీలను పూర్తిగా ధ్వంసం చేయడం చాలా అన్యాయం అన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా 50 నుంచి 70 మంది వరకు వచ్చి జెసిబిలతో తొలగించడం బాధాకరమన్నారు. శంకరమఠం రోడ్డులో రూ.1.50 లక్షలతో బడ్డీ బాగు చేసుకుంటే అధికారులు వచ్చి పూర్తిగా ధ్వంసం చేశారని, ఆధారం కోల్పోయేలా ప్రవర్తించారని చిరు వ్యాపారి కె.సునీత ఆవేదన వ్యక్తంచేశారు.

వీధి విక్రయదారుల చట్టాన్ని అమలుచేయాలి

అక్కయ్యపాలెం నరసింహ నగర్ రోడ్డులో 2014 వీధివిక్రయిదారుల చట్టాన్ని వెంటనే అమలు చేసి హాకర్ జోన్స్ నిర్మించాలని ప్రభుత్వాన్ని ఫుట్‌పాత్ అండ్ తోపుడుబళ్ల కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, వామనమూర్తి డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా రూ.కోట్లలో దోపిడీకి పాల్పడుతూ భవంతులు నిర్మించుకుంటున్న బడా బాబులు జోలికి పోలేని జివిఎంసి అధికారులు పేద, చిల్లర వర్తకులు, తోపుడు బళ్ల కార్మికులపై ఉగ్ర రూపం చూపడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సాయికుమార్, జె.శ్రీనివాస్, నీలకంఠం, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఖండిస్తున్నాం : సిఐటియు జిల్లా కమిటీ

చిరు వ్యాపారులపై జివిఎంసి అధికారుల దాడులను ఖండిస్తూ ఈ నెల 22వ తేదీన జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు పి.వెంకటరావు, సింహాచలం తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులను కొనసాగించాలి




నిరసన తెలుపుతున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

ప్రకాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో గత నాలుగు నెలల కిందట తొలగించిన కాంట్రాక్టు కార్మికులను యథావిధిగా కొనసాగించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద చేపట్టిన నిరసనలు గురువారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి యువకులను తీసుకొచ్చి పనులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ సేఫ్టీలు నిలుపుదల కోసం సేఫ్టీ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేశారు. గత 25 సంవత్సరాలు నుంచి పని చేస్తున్న నైపుణ్యం ఉన్న కార్మికులను తొలగించి, ఇతర రాష్ట్రాల వారితో పనులు చేయించడం దుర్మార్గం అన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి తొలగించిన నిర్వాసితులను, స్థానికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అందులో భాగంగా శనివారం కార్మిక సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తానని యాజమాన్యం హామీ ఇచ్చిందని, శనివారం చర్చలు సానుకూలంగా లేకుంటే సోమవారం నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి కార్మిక సంఘాలు నిర్ణయించాయన్నారు. శుక్రవారం శనివారం టిటిఐ సేఫ్టీ వద్దకు తొలగించిన కార్మికులు రానవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, పితాని భాస్కరరావు, కురం దాస్ వంశీ, ప్రసాద్, యూనియన్ నాయకులు పరంధామయ్య పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఎల్‌జి పాలిమర్స్ సౌజన్యంతో జివిఎంసి 92వ వార్డు పరిధి వెంకటాపురంలో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు గురువారం ప్రారంభించారు. ఎల్‌జి పాలీమర్స్ స్టెరెయిన్ గ్యాస్ లీక్ ఘటనలో గ్రామంలోని భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర మంచినీటి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీనికి ఎల్‌జి పాలిమర్స్ బాధ్యత వహిస్తూ తాగునీటి కోసం మంచినీటి శుద్ధిప్లాంట్‌ను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు ఎమ్మెల్యే గణబాబు చొరవతో ప్లాంట్‌ను ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జి పాలిమర్స్ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంచినీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న పంచవటి ప్రతినిధులు

ప్రసాదుల శ్రీనివాస్‌కు అభినందనలు

ప్రజాశక్తి -గాజువాక : ఎపిఐఐసి డైరెక్టర్‌గా నియమతులైన ప్రసాదుల శ్రీనివాస్‌ను పంచవటి టౌన్ షిప్ యజమానులు గాజువాక పార్టీ కార్యాలయంలో గురువారం కలిసి సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.చిన్నారావు పాల్గొన్నారు.

బోదకాలుపై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : పురుషోత్తపురం యుపిహెచ్‌సిలో గురువారం బోదకాలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి గణేష్ పట్నాయక్ మాట్లాడుతూ, బోధకాలు ఏడు స్టేజీల వరకు ఉంటుందని, ప్రారంభంలోనే జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి ప్రమాదకరం లేకుండా జీవించవచ్చని తెలిపారు. వ్యాధి కలిగిన వారు రోజూ కాళ్లతో వ్యాయామం చేయాలన్నారు.

బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలోని ద సెడార్ పాఠశాల విద్యార్థులు బీచ్ పరిసరాల్లో గురువారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. తీరంలోని చెత్తను సేకరించి జివిఎంసి వాహనాల్లో తరలించారు. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

చెట్టినాడు సిమెంట్స్‌కు జాతీయ ఇంధన సామర్థ్య అవార్డు



అవార్డు అందుకుంటున్న విశాఖ యూనిట్ హెడ్ ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ 2025 జాతీయ శక్తి నిర్వహణ అవార్డులలో 'అద్భుతమైన శక్తి సామర్థ్య యూనిట్' అవార్డును అందుకుందని ఫ్యాక్టరీ ఎజిఎం .నరసింహరాజు గురువారం తెలిపారు 26వ జాతీయ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ 2025లో 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియంట్ యూనిట్' అవార్డును ఈ నెల 17న హైదరాబాద్‌లో అందుకున్నారు.

చెట్టినాడు సిమెంట్స్ తరపున విశాఖ యూనిట్ హెడ్ పి.ప్రసాద్‌బాబు అవార్డును అందుకున్నారు. చెట్టినాడు సిమెంట్స్‌కు జాతీయ అవార్డు రావడంపై సంస్థలోని ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విజన్ విద్యార్థుల విహార యాత్ర



భారీ గణపతి విగ్రహం వద్ద విద్యార్థులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన విజన్ స్కూల్ విద్యార్థులు గురువారం విహార యాత్రకు వెళ్లారు. అనకాపల్లి ఎన్‌టిఆర్ గ్రౌండ్‌లో 126 అడుగుల భారీ గణపతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మేడిశెట్టి సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ శైలజ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం పాఠశాలకు పరిమితం చేయకుండా, విజ్ఞానయాత్రలకు తీసుకెళ్లడంమనే నూతన ఒరవడి ద్వారా వారిలో ప్రయోగాత్మక, వైజ్ఞానిక పద్ధతుల్లో అవగాహన కల్పించాలన్నదే లక్ష్యమన్నారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పేటబయ్యవరం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛతకార్యక్రమం చేపట్టినట్లు సోషల్ టీచర్ బొడ్డేడ సత్యనారాయణ తెలిపారు. పాఠశాల ముందున్న మురుగునీరు, బురద శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. పిచ్చిమొక్కలు గడ్డి తొలగించారు. హెచ్ఎం బివి ధనలక్ష్మి, ఆంగ్ల ఉపాధ్యాయులు కర్రి వీరభద్రరావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చిక బయలు కాదిది.. చెరువే!



బంగారు మెట్టలోని భూపతయ్య చెరువు

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట, వడ్డాది : ఈ ఫోటోలో కనిపిస్తున్నది పచ్చికబయలు అనుకుంటే పొరపడినట్లే! ఎందుకంటే ఇది చెరువు. మండలంలోని బంగారుమెట్ట గ్రామంలోని భూపతయ్య చెరువు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరింది. నీటిపై నాచు కట్టి పైపొర ఆకుపచ్చగా దర్శనమిస్తోంది.చెరువు గట్టుపైనుండి వెళ్తున్న వారు, ప్రకృతి ప్రేమికులు చెరువును ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రమాదకరం

- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కృతనిశ్చయంతో వున్నట్లు మరోసారి స్పష్టమైంది.కొన్ని రంగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడమే తమ ప్రభుత్వ విధానమని2021 బడ్జెట్‌లోనే పేర్కొన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విశాఖలో జరిగిన జిఎస్‌టి సమ్మిట్‌లో బహిరంగంగా ప్రకటించారు. ప్రభుత్వరంగం ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే ధోరణితో కేంద్రమంత్రి వ్యాఖ్యలు దేశ ఆర్థిక స్వావలంబనకు, ప్రజల సంక్షేమానికి తీవ్ర వ్యతిరేకమైనదిగా సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ భావిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు విమర్శించారు. 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక, ప్రైవేటీకరణ విధానాలు ఇప్పటికే ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేస్తోందన్నారు. జాతీయ భద్రతా రంగం మినహా మిగతా ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ వర్గాలకు అప్పగించాలనే కుట్రలు మరోసారి బహిర్గతమైన నేపథ్యంలో ఇది దేశానికి ప్రమాదకరమన్నారు. . ప్రజలకు ఉద్యోగ భద్రత, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అన్నీ తాకట్టు పెట్టినట్టేనని హెచ్చరించారు. లక్షలాది కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించకూడదని కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నా వాటిని పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం హేయమని ధ్వజమెత్తారుప్రభుత్వరంగ పరిశ్రమలు కేవలం ఉద్యోగావకాశాలే కాకుండా, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యం, ప్రజా అవసరాల కోసం నిర్మించబడ్డాయని సిపిఎం గుర్తుచేస్తుందన్నారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, యువత, ప్రజలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్, నేర రహితంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాను డ్రగ్స్, నేర రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయవాడలో ముఖ్యమంత్రితో రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనిఅంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రైమ్ రేటు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలలు, బస్ స్టాపుల వద్ద అసభ్య ప్రవర్తన జరగకుండా హాట్ స్పాట్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.. గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాలు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు సూక్ష్మ సేద్యం నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, పశుసంవర్ధక శాఖ ప్రతిపాదనలను మండలవారీగా షేర్ చేయాలని, జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు

.గ్రామాల్లో మునగ చెట్ల పెంపకం, మునగ ఆకుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ప్రతిపాదనలు పరిశీలించాలన్నారు.దోబీ ఘాట్లకు ఆధునిక వసతులు, బ్యాంక్ లింకేజ్ కల్పించాలని, నైపుణ్యాభివృద్ధి శాఖ ద్వారా నిరుద్యోగులు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా నివారణకు కోఆర్డినేషన్ చేయాలని, పైపులైన్ లీకేజీలను వెంటనే సరిచేయాలని సూచించారు. సమీక్షా సమావేశం లో జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, డిఆర్వో వై. సత్య నారాయణరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల పరిశీలన

అమృత్ భారత్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులు పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఎస్కలేటర్, ప్లాట్ ఫామ్, ప్రయాణికులు విశ్రాంతి భవనాల పనులను పరిశీలించి, రైల్వే స్టేషన్ అధికారులతో పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ షేక్ ఆయిషా, అదనపు డివిజనల్ ఇంజనీర్, పర్యవేక్షణ ఇంజనీర్ చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్,పాల్గొన్నారు.

నేడు, రేపు దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



సబ్బవరంలో సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న లేఖర్లు

ప్రజాశక్తి. సబ్బవరం.: దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు ఈ నెల 19,20 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ ఆందోళన చేపడుతున్నట్లు రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం జాయింట్ సెక్రెటరీ శేఖర్‌మంత్రి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని శ్రీ దుర్గమాంబ దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపడతామన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఒటిపి విధానంతో స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తులు, భూముల రిజిస్ట్రేషన్లకుకార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల కారణంగా దస్తావేజుల తయారీలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న నూతన విధానాలలో ప్రభుత్వం మార్పులు తీసుకురావాలని కోరారు .అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ గౌస్య జిలాని బేగంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఎస్ఆర్ మూర్తి (వాసు), జెఎస్ఆర్ మూర్తి, ఎస్.శ్రీనివాసరావు, ఎన్. రామచంద్రరావు, డి సురేష్ వర్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు. సున్నం చిదంబర స్వామి గురువారం మీడియాతో తెలిపారు. సాఫ్ట్వేర్, ఒటిపి సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఆనందపురం : రిజిస్ట్రేషన్ శాఖలో ఇటీవల అమలు చేసిన కొత్త విధానాలు దస్తావేజు తయారీ ప్రక్రియను క్లిష్టతరం చేస్తున్నాయని ఆనందపురం దస్తావేజు లేఖర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 19, 20 తేదీలలో పెన్‌డౌన్ చేపట్టనున్నట్లు దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు ప్రకటించారు.

98 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దుర్గాభవాని

ప్రజాశక్తి- వడ్డాది : జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో విజయరామరాజుపేట పిఎసిఎస్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరంలో 98 మంది కంటి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందిని దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి కంటి ఆపరేషన్‌కు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు కంటి నరాలు, కంటి కాసులు, కంటి రెప్పలు, చిన్నపిల్లల కంటి సమస్యలపై ఒక్కొక్కరు, కనుగుడ్డు పైపొర చికిత్సకు ఇద్దరి గుర్తించారు. వీరిని మెరుగైన వైద్యంకోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దొడ్డి కిషోర్, సెక్రటరీ జగన్, సభ్యులు, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ దుర్గాభవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ దేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోబో కోప్లర్‌తో డైట్ ఎంఒయు



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- అనకాపల్లి : రాబోయే తరాలకు ఆవిష్కారాత్మక విద్యను అందించేందుకు పరిశ్రమ-విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే దిశగా రోబోకోప్లేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో డైట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం రోబోకోప్లేర్ సిఇఒ ప్రవీణ్ మల్ల డైట్ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నారు. డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలలో ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమ ప్రాజెక్ట్స్, ఇంటర్న్‌షిప్, సంయుక్త పరిశోధన అవకాశాలు కలుగుతా యని తెలిపారు. ఈ సందర్భంగా సిఇఒ ప్రవీణ్‌మల్ల మాట్లాడుతూ భవిష్యత్తు తరం మేధావులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణకు డైట్‌తో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ద రైజ్ ఆఫ్ ఇండస్ట్రియల్ రోబోట్స్ ఇన్ మోడ్రన్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ వైకుంఠరావు, డాక్టర్ జి.వి. శ్రీధర్, డాక్టర్ ఫణిబాబు పాల్గొన్నారు

ముసలినాయుడు జన్మదిన వేడుకలు



ముసలి నాయుడును సత్కరిస్తున్న సతీష్ కుమార్

ప్రజాశక్తి- మునగపాక: తెలుగుదేశం సీనియర్ నాయకులు దాడి ముసలినాయుడు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ సమక్షంలో కేకు కట్ చేయగా, పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, కూటమి నాయకులు మొల్లేటి సత్యనారాయణ, ఎల్లపు వెంకట భాస్కరరావు, మొల్లేటి ఆనంద్, దాడి అప్పలనాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, శరగడం యోగి నాగేశ్వరరావు, వెలగా మురళి, సూరిశెట్టి అప్పలనాయుడు, వేగి కృష్ణ, కారుకొండ కాశీ, దొడ్డి భాస్కరరావు, ఎలక రవి, కోయిలాడ గంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న భీమిలి డైట్ అధ్యాపకులు

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట : మండలంలోని పెద్దమదిన, గున్నెంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను భీమునిపట్నం డైట్ అధ్యాపక బృందం గురువారం సందర్శించింది. పాఠశాలలో మూల్యాంకనం, గ్రేడింగ్ విద్యార్థుల అభ్యాస ఫలితాలను అంచనా వేసే విధానం, గ్రేడింగ్ విధానం పరిశీలించారు. టీచర్ హ్యాండ్‌బుక్స్, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు, బోధన పద్ధతుల్లో హ్యాండ్‌బుక్స్ వినియోగంపై పరిశీలించారు. విద్యార్థుల రచన నైపుణ్యాలు నోటుబుక్స్, రాతపని పరిశీలించి, వారి హస్తకళ, రాత, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను అంచనా వేశారు. విద్యార్థుల రాయడం అలవాటు పెంపొందించేందుకు డిక్టేషన్, క్రియేటివ్ రైటింగ్ వంటి కార్యకలాపాలను సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్ స్వామి, షేక్ అల్లాద్దీన్, ఎంవి. రమణ, . ఉదయశేఖర్ పాల్గొన్నారు

షరతుల్లేకుండా యూరియా సరఫరా

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులకు ఎటువంటి షరతులు విధించకుండా కావలసిన యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని కాంగ్రెస్ నేతలు కోరారు. గురువారం డిఆర్‌ఓ సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచిసరిపడా యూరియా అందకపోవడంతో ప్రైవేటు డీలర్స్, దళారీలను ఆశ్రయించి రైతులు నష్టపోతున్నారన్నారు. పిఎసిఎస్‌ల్లోని ఎరువులు దొడ్డిదారిని తరలిపోతున్నాయని, ఆరోపించారు. డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న, జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ జి గోవిందరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, విన్న కోట రాము, తనకాల అనంత రావు, పడాల కొండలరావు, మారుతి చక్రవర్తి, కె చిన్న బాబు కాంగ్రెస్ నాయకులు పి ఎస్ దత్తు,కాళ్ళ సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్, సేనాపతిరాజు, ఆర్ఆర్ నాయుడు,బుద్ధ మహేష్, యేసు రాజు, చక్రవర్తి, పి రాము, ఆనంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత

ప్రజాశక్తి- అనకాపల్లి : నేరగాళ్ళు నూతన పద్ధతులు అవలంబిస్తూ ప్రజలను మోసం చేస్తున్నందున, సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. ఓటిపి, బ్యాంక్, బ్యాంక్ మోసాలు, ఫిషింగ్ లింకులు, తప్పుడు ఎస్ఎంఎస్, ఇమెయిల్స్, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, లాటరీ, లక్కీ డ్రా మోసాలు, లవ్, ఫ్రెండ్‌షిప్ స్కామ్‌లు, నకిలీ జాబ్, లోన్ ఆఫర్లు,ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిపై ఫిర్యాదుకు 1930 నంబర్‌కు కాల్ చేయాలి. లేదా www.cybercrime. gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల అసోసియేషన్
నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -కశింకోట : ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అనకాపల్లి జోన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక సరస్వతి విద్యాలయంలో గురువారం నిర్వహించినట్లు నూతన అధ్యక్షుడు ద్వారపురెడ్డి రవి తెలిపారు. నూతన కమిటీలో జోన్ అధ్యక్షునిగా ద్వారపురెడ్డి రవి, వైస్ ప్రెసిడెంట్‌గా వేగి వీరునాయుడు, వసంత,సెక్రటరీగా ఎస్ అన్నారావు కోశాధికారిగా ఆర్ దేవుడుబాబు, జాయింట్ సెక్రటరీగా సుమన్ అడిషనల్ సెక్రటరీగా దేవర చిరంజీవి ఎన్నికయ్యారు. కొత్త కమిటీని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రామరాజు, ఎన్నికల అధికారి రామకృష్ణ, పూర్వ అధ్యక్షులు రాజశేఖర్, బంగార్రాజు, పలువురు కరస్పాండెంట్స్ అభినందించి సత్కరించారు.

చిన్న తరహా పరిశ్రమలకు సబ్సిడీ రుణాలు



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి త్రివేణి

ప్రజాశక్తి-. సబ్బవరం : చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ. మూడు లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందిస్తాయని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇండస్ట్రియల్ ప్రాజెక్టు ఆఫీసర్ త్రివేణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో విశ్వ బ్రాహ్మణులు, యువత, పారిశ్రామిక వేత్తలకు ఎంఎస్ఎంఇ ద్వారా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న తరహా పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం జెడ్ సర్టిఫికెట్ అందిస్తుందని, దాంతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. విశ్వబ్రాహ్మణులకు గోల్డ్ స్మిత్, కార్పెంటర్ తదితర చేతివృత్తులవారు రుణాలను వినియోగించుకోవాలన్నారు. ఎంపిడిఒ పి. పద్మజ, ఏజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కాళ్ల జగపతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శరగడం సాగర్సి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎం గంగరాజు, సెక్రెటరీ సి హెచ్ సూరిబాబు, సంఘం మండల అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ స్థలంలో అనుమతుల్లేకుండా ఎగ్జిబిషన్



పోలీస్ స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్

ప్రజాశక్తి, అనకాపల్లి రూరల్: అనకాపల్లి పట్టణంలో సర్వే నంబర్ 813 పోలీస్ ఠాణా స్థలంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఎగ్జిబిషను ఏర్పాటు చేయడంపై సిపిఐ నేత వై ఎన్ భద్రం అభ్యంతరం వ్యక్తం చేశారు . పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న జివిఎంసి చెందిన భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండగా గతంలో అడ్డుకున్నామన్నారు. అప్పట్లో సిపిఐ ఫిర్యాదుకు స్పందించి నాటి జెడ్‌సి కనకమహాలక్ష్మి ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుండి ఇంతవరకు ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు జరగలేదు. కానీ ఇపుడు అకస్మాత్తుగా ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ స్థల వివాదం కోర్టులో ఉండగా జివిఎంసి స్థలంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం కోర్టు ధిక్కరణ నేరం అవుతుందని, 20 రోజులుగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నా, జెడ్‌సి, టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం, అక్రమాలను ప్రోత్సహించడమేనని ఆక్షేపించారు. తక్షణం తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేయాలి : జెసి



సమీక్షలో మాట్లాడుతున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి- అనకాపల్లి: గ్యాస్ సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమకాని లబ్ధిదారులు బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి లబ్ధిదారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దీపం -2 పథకంలో భాగంగా 2వ విడత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, బ్యాంకు ఖాతాకు సబ్సిడీ నగదు జమపై సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలోని 24 ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 805 మందికి సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమ కాలేదని, దీనికి కారణాలు లబ్ధిదారులకు తెలియ జేయాలన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ కానందున గ్యాస్ సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమకాని లబ్ధిదారులు నేరుగా బ్యాంకు వద్దకు వెళ్లి బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోవాలని అందుకు ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, అధికారులు దీన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాకు ఆధార్ ఎన్‌పిసిఐ లింకయిన తర్వాత మాత్రమే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు గ్యాస్ సబ్సిడీ నగదు జమ చెయ్యడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కె వి ఎల్ ఎన్ మూర్తి, పౌరసరఫరాల ఉప తహసీల్దార్లు, ఎల్ పి జి గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.

22 నుంచి కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ, ఉత్సవ కమిటీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు తెలిపారు. గురువారం గవరపాలెం భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అధ్యక్షతన ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వహకుడు కాంగ్రెస్ నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు తదితరులు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ఆనవాయితీ నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌గుల నూక అప్పారావు, కాంగ్రెస్‌గుల రాజారావు, కర్రి సన్యాసినాయుడు, గౌరీ పరమేశ్వరుల ఆలయ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, ఉపాధ్యక్షుడు కొణతాల వరప్రసాద్, నాటకోత్సవాల పర్యవేక్షకుడు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కే యం నాయుడు, మరిడిమాంబ ఆలయ కమిటీ చైర్మన్ కేయం నాయుడు, శ్రీ శివశక్తి ఫ్రెండ్స్ సంస్థ అధ్యక్షుడు పీలా రాముడు, మద్దాల శంకర్రావు, దాడి కృష్ణ, సూరిశెట్టి నరసింగరావు, కొణతాల ఉమ, మళ్ల జగ్గప్పారావ్, కాంగ్రెస్‌గుల శ్రీరామ్,పాలిమేర శ్రీనివాసరావు, బుద్ధ సంతోష్, గండేపల్లి మురళి, పీలా శ్రీనివాసరావు, పెంటకోట జగదీష్, విల్లూరి మాధవ్ పాల్గొన్నారు.

22 నుంచి ఆహ్వాన నాటకోత్సవాలు

గవరపాలెం శతకంపట్టు వద్ద దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గౌరీ సేవా సంఘం ప్రోత్సాహంతో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ఈనెల 22 నుంచి 26 వరకు జరుగుతాయని నాటకోత్సవాల పర్యవేక్షకులు కేఎం నాయుడు తెలిపారు. 22వ తేదీన శ్రీరామ పాదుకా పట్టాభిషేకం పద్య నాటకం, 23న 27వ మైలురాయి, జనరల్ బోగీలు నాటికలు, 24నన ఆవేశంలో ఆనందం, ఇది అతని సంతకం నాటికలు, 25న అమ్మ చెప్పిన బొమ్మ, నాన్న నాటికలు, 26న విడాకులు కావాలి, భువి కోరని భ్రమణం నాటికలు ప్రదర్శిస్తారన్నారు.

ఎన్‌టిపిసి నిధులతో అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పరవాడ : ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని వాడచీపురుపల్లి పంచాయతీ ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో. గ్రామం, పరిసర శివారు ప్రాంతాల్లో అత్యవసరమైన అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరుతూ ఎన్‌టిపిసి యాజమాన్యానికి సర్పంచ్ శివలంక లక్ష్మీ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఉప సర్పంచ్ కుంద్రపు శ్రీను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేష్ పాల్గొని గ్రామ సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపడతామని ఎన్‌టిపిసి ప్రతినిధులు వెల్లడించారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోనిదుర్గమాంబ దస్తా వేజు లేఖర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగిందని రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం జాయింట్ సెక్రటరీ శేఖర్ మంత్రి శ్రీనివాసరావు తెలిపారు. గౌరవాధ్యక్షులు బిక్కవల్లి రామ్మూర్తి(రాంబాబు), అధ్యక్షునిగా వల్లభ జోస్యుల సీతారామమూర్తి (వాసు),ఉపాధ్యక్షులుగా జూరెడ్డి శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శేఖరమంత్రి శ్రీనివాసరావు పట్నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దంతులూరి సురేష్ వర్మ, జాయింట్ సెక్రెటరీగా నరవ రామచంద్రరావు, కోశాధికారి గొప్ప శేఖర్, లీగల్ అడ్వైజర్‌గా బి సత్యనారాయణ(రమేష్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పంట కాలువ పూడికతీతకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో జంగమయ్య చెరువు పంటకాలువలో పూడికను తీసే పనులకు సాగునీటి సంఘం చైర్మన్ తంగేటి శ్రీను గురువారం శంకుస్థాపన చేశారు. సాగు నీటి సంఘం వైస్-చైర్మన్ దొంక వెంకటరమణ, డైరెక్టర్లు మలిరెడ్డి పైడంనాయుడు, బండారు తాతదొర, మలిరెడ్డి ఈశ్వరరావు, ఎంపిటిసి కశిరెడ్డి దేముడుబాబు, టిడిపి గ్రామ అధ్యక్షుడు రాళ్లపల్లి దేముడుబాబు,కొడుకు గంగరాజు, రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, బండారు ప్రసాద్, రాళ్లపల్లి చినమూర్తి,

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - పరవాడ : ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలురు, బాలికల క్రీడా పోటీలను గురువారం డిఇ. ఎం.వినోద్ బాబు ప్రారంభించారు. రెజ్లింగ్, తైక్వాండో, థాంగటా మార్షల్ ఆర్ట్స్, గట్కా పోటీలలో ఎస్‌వీఎస్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభను చూపారు సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు మోడ్రన్ పెంటాథ్లాన్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచారు. పోటీల నిర్వహణలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.పుష్పలత కీలక భూమిక వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి ఇలాంటి పోటీలు తోడ్పడతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎంపిడిఒకు సత్కారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : స్థానిక ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్‌ను గురువారం వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షులు దొండ నరేష్ , ఇతర కూటమి నేతలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తలారి శంకర్, అకిరెడ్డి కనకరాజు, కోరుకొండ గురుమూర్తి పాల్గొన్నారు.

దుర్గాదేవి నవరాత్రుల లక్కీ లాటరీ

ప్రజాశక్తి - పరవాడ : యంగ్ మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరవాడలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా లక్కీ లాటరీ నిర్వహిస్తున్నారు. రూ.పది టిక్కెట్‌తో పది ప్రధాన బహుమతులతోపాటు ఐదు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నారు. మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు ఇంటిలో, అసోసియేషన్ సభ్యులు, పెద్దల సమక్షంలో వ్యాపారవేత్త కంకటాల శివ లాటరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పయిల రామచంద్రరావు, మాజీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్ పోతల అప్పలనాయుడు, రొంగలి అప్పలనాయుడు, చుక్కా రవికుమార్, పరవాడ జగదీష్, కొసిరెడ్డి అప్పలరాజు, చుక్కా అప్పలనాయుడు, చుక్కా నోమో, రెడ్డి నారాయణరావు, గండి శ్రీనివాసరావు, గండి సన్యాసిరావు, బండారు ఆనంద్, దుర్గిపూడి వెంకటేష్, తెలు రమణజీ, బొడ్డు బుజ్జి, గండి సురేష్, పైలా నాయుడు, గండి రమేష్, పయిల సన్యాసిరావు, శిర సన్యాసిరావు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్‌ను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును నిలుపుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 5వ రోజుకు చేరింది. కంబాల జోగులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ,జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, తదితర నాయకులు మత్స్యకారుల ఆందోళనకు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ మత్స్యకారులు ఉపాధి, ఉనికికి నష్టం చేకూర్చే బల్క్ డ్రగ్ ను ఏర్పాటు చేయకూడదన్నారు. మత్స్యకారుల పోరాటాన్ని,వారి సమస్యలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. మత్స్యకారుల శాంతియుత పోరాటం పై పోలీసులు పెడుతున్న కేసులు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.గంగరాజు, వై.నాగేష్, పి.సత్తియ్య, పి.తాతీలు, ఎం.మహేష్ బాబు, జీ.స్వామి, సిహెచ్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

దీక్షల అనుమతి కోసం వినతి

నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలకు సంబంధించి టెంటు, మైక్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గురువారం నక్కపల్లి లో డిఎస్పి శ్రీనివాసరావు, సీఐ కుమారస్వామి, తహసిల్దారు నరసింహమూర్తి లకు మత్స్యకారులతో కలిసి అఖిలపక్ష పార్టీల నేతలు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కంబాల జోగులు,



దీక్షలో జోగులు, అప్పలరాజు, మత్స్యకారులు

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత వీసం రామకృష్ణ, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపిపి వీసం నానాజీ, రాజయ్యపేట ఎంపిటిసి సభ్యులు పిక్కి సత్తియ్య, పలు గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సమన్వను విన్నవించారు. రిలే నిరాహార దీక్షలకు పోలీసులు టెంటు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ఎండకు వానకు, ఇబ్బందులు పడుతూ ఆందోళన కొనసాగిస్తున్నారన్నారు. ఈ మేరకు టెంటు, మైక్ ఏర్పాటు చేసుకునేందుకు పోలీసులు అనుమతులు ఇచ్చారు.



ఈ పాస్ మిషన్లు ఇస్తున్న ఆర్‌డిఒ రమణ

ఈ-పాస్ మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లకు నూతన ఈ-పాస్ మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.వి. రమణ నూతనంగా మంజూరైన 5జీ సాంకేతికతతో కూడిన ఈ-పాస్ మిషన్లను అందజేశారు. సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ చందన రేఖ మాట్లాడుతూ నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన డీలర్లకు ఈ మిషన్లు అందించామని తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ, ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో రేషన్ సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఈ మిషన్లను అందజేసిందన్నారు.

58వ రోజుకు దళిత రైతుల దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరు దళిత భూముల్లో ఉన్న క్వారీ అనుమతులు రద్దు చేయాలని నర్సీపట్నం సభ కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత రైతులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష గురువారం 58వ రోజుకు చేరింది. సిపిఎం నాయకులు ఈ రెల్లి చిరంజీవి మాట్లాడుతూ, దళితులు భూముల్లో మైనింగ్‌తో జీడి మామిడి తోటలు నాశనం అవుతున్నాయని, దీంతో ఉపాధి పోతుందన్నారు. మైనింగ్‌తో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. క్వారీ రద్దు చేయాలన్నారు. బి.ఎస్.పి రాష్ట్ర నాయకులు నాగరాజ్ మాట్లాడుతూ దళితులు 58 రోజుల నుండి నిరసన తెలియజేస్తున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయ మన్నారు. ఈ కార్యక్రమంలో దళిత రైతులు అప్పారావు, పెంటయ్య, సతీష్ కుమార్, చిరంజీవి లక్ష్మీ పాల్గొన్నారు.

జనవాణి ప్రారంభం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో గురువారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలను తెలియజేశారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, ఈ ఫిర్యాదుల్ని సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటరమణ గుడివాడ కృష్ణ, పోలుపర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా దొరబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు, వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ దొరబాబు జన్మదిన వేడుకలు నాయకులు కార్యకర్తలు అభిమానుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ధర్మసాగరం గ్రామంలో మొక్కలు నాటారు. నర్సీపట్నంలో 70 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్, మారిశెట్టి రాజా, లంక సతీష్, లంక సత్యనారాయణ, గొంప కృష్ణ, కిరణ్, సమిరెడ్డి కిరణ్, కర్రి సంతోష్, మోపడ చిరంజీవి, బైన మురళి, చొప్ప నానీజీ, సహదేవుడు పాల్గొన్నారు.

సుడి దోమపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -చీడికాడ:వరి పంటపై సుడిదోమ తెగులు విజృంభిస్తున్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి అన్నారు. మండల కేంద్రంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని, సుడిదోమ ప్రారంభ దశలో ఉన్నప్పుడే ఎసిపేట్ సెవెంటీ ఫైవ్ ఎస్ పి ఎకరాకు 300 గ్రాములు పిచికారి చేయాలని తెలిపారు.

కొత్తకోట:కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావికమతం మండలం మత్స్యవానిపాలెం గ్రామం లో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలంలో సుడి దోమ ఉద్రిక్తత ఎక్కువగా ఉందని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరింత వ్యవసాయ సమాచారం కొరకు రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రి నెం 2318004198800 ను సంప్రదించ వచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



చీడికాడలో పంటను పరిశీలిస్తున్న ఎఒ

సత్తిబాబు, సౌజన్య పాల్గొన్నారు.

రోలుగుంట:రోలుగుంట మండలం కొంతలం గ్రామంలో వ్యవసాయశాఖ, ఆత్మవారి సౌజన్యంతో క్షేత్ర పాఠశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సిహెచ్.చిరంజీవి మాట్లాడుతూ నానో యూరియాతో అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీదేవి, ఏడిఎ అనకాపల్లి ఝాన్సీలక్ష్మీ, ఆత్మ బిటిఎం లక్ష్మీ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కోటవురట్లలో పంపిణీ చేస్తున్న కాశీనాయుడు

ప్రజాశక్తి-కోటవురట్ల:రేషన్ బియ్యాన్ని అమ్మేసు కుంటే తిరిగి వాటిని అందమైన సంచిలో వేసి మనకే అమ్ముతున్నారని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు అన్నారు. గురువారం మండల పరిషత్ ఆవరణ వద్ద స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేశారు.మండల వ్యాప్తంగా 17873 రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లింగన్న నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు జనార్దన్, జనసేన మండల అధ్యక్షుడు శ్రీనివాస్,జానకి శ్రీను, ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపిటిసి సభ్యులు సూర్యారావు పాల్గొన్నారు.

మాడుగుల:ఎం.కె వల్లాపురంలో టీడీపీ నాయకులు మజ్జి లక్ష్మణరావు, శ్రీను, సెక్రెటరీ చాణిక్య స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మజ్జి గణేష్, నాయుడు, కొట్ని భీమునాయుడు, మజ్జి గంగాధర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండల కేంద్రంలో స్మార్ట్ కార్డుల పంపిణి చేపట్టారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్దం మాట్లాడుతు కూటమి ప్రభుత్వం రేషన్ విధానంలో సమూల మార్పులు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జై రమేష్ బాబు, ఎంపిడీవో మీనాకుమారి, సియస్‌డిటి గణపతి రావు, కూటమి నాయకులు గుర్రం రామకృష్ణ, బొలిశెట్టి గోవిందరావు, ఎన్ వెంకటరాజు, జోగినాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: జివిఎంసి 81వ వార్డు పీలా వెంకటరెడ్డి నాయుడువీధిలో లబ్దిదారులకు గురువారం స్మార్ట్ రేషన్ కార్డులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు పంపిణీ చేశారు. టిడిపి నేత చదరం శివ అప్పారావు, పెంటకోట శివరాం పాల్గొన్నారు.

జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను గురువారం ఎంపిడిఒ సీతారామరాజు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, వరకట్నం వేధింపులు, గృహ హింసపై కౌన్సిలింగ్‌కు సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రత్నప్రభ, ఏపీఎంలు కళ్యాణి, శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ నూకరాజు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, బాలకృష్ణ, వెలగా శ్రీను పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో ఈనెల 19న శుక్రవారం విద్యుత్ లైన్ మరమ్మత్తు పనులు, కింతలి సబ్ స్టేషన్‌కి కొత్త లైన్ వేయడంతో గాదిరాయి సబ్ స్టేషన్ పరిధి గ్రామాలు వమ్మలి, వి.జె.పురం, గాదిరాయి, సత్యవరం, డి.గొట్టివాడ, కొత్తవలస, కె వెలంపాడు, జె డి పేట, కింతలి, కింతలి వల్లపురం, ఎం.కృష్ణాపురం, పొంగలిపాక, జాలంపల్లి,పొన్నవోలు అవురువాడా గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వి. ఎస్. ఎం అప్పారావు తెలిపారు.

గ్రామాల్లో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో పలు గ్రామాల్లో ఎంపీడీవో పి.మీనాకుమారి స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ధర్మవరం, రాయవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. స్వచ్ఛత ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రజలు శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీగౌరి సందర్శించారు. అనంతరం ఏఎల్.పురం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించి మహిళలకు, గర్భవతులకు, బాలింతలకు పోష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఏఎల్.పురం అంగన్వాడి సెంటర్-4లో ఎంపిటిసి నిధులతో చేపడుతున్న వాటర్ ట్యాంక్ ఫ్లబింగ్ పనులతో పాటు అంగన్వాడీ కేంద్రం ఆవరణలో సిమెంట్ కాంక్రీట్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, వైద్యాధికారులు గాయత్రి, జ్యోతి, హేమలత, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా అప్పికొండమ్మతల్లి పండగ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాతకృష్ణదేవిపేట గ్రామంలో గురువారం అప్పికొండమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే మహిళలు ఆలయం వద్ద బారులు తీరి అమ్మవారికి పసుపు కుంకుమ, చీరలు, గాజులతో పాటుగా నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ చూపరులను ఎంతో ఆకట్టుకుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రణభేరి

- బోధనేతర పనులు నిలిపివేయాలి

-ఆర్థిక బకాయిలు, డిఎలు చెల్లించాలి - యుటిఎఫ్ నేతల డిమాండ్



మాడుగులలో రణభేరి జాతాలో పాల్గొన్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-మాడుగుల: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యుటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. ఆర్థిక, విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రణభేరి జాతా పాడేరు నుండి మాడుగుల ఘాట్ రోడ్‌కు గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా రెడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ, 12వ పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోదనేతర పనులు రద్దు చేయాలని, సీపీస్, జిపిఎస్ లు కాకుండా వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సి కమిషనర్ రాజీనామా చేసి 15 నెలలు గడుస్తున్నా మరొకరిని నియమించలేదన్నారు. వేలాది కోట్ల రూపాయలు బకాయిలు పెండింగ్ లో ఉన్నా ప్రభుత్వం విడుదల చేయడం లేదని తెలిపారు. ఈనెల 25న గుంటూరులో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఉపాధ్యాయులు నినాదాలు చేస్తూ ఘాట్ రోడ్ జంక్షన్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, జిల్లా కార్యదర్శి కొలిమిర చంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: మండలంలో వడ్డాది, బుచ్చయ్యపేట, రాజాం మీదుగా యుటీఎఫ్ రణభేరి గురువారం సాగింది. ఈ సందర్భంగా రణభేరికి ఉద్యోగ ఉపాధ్యాయలు ఘనంగా స్వాగతం పలికారు. రాలీగా అనకాపల్లి మండలంలోనికి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న విజయ్‌ప్రకాష్

యోగా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థి సత్తా

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో 9 వ తరగతి చదువుతున్న బండారు దేవాన్ష నాయుడు జాతీయ స్థాయి అండర్ -17 వ్యక్తిగత యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం సాధించాడని గురువారం శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ నెల 13 నుండి 16 వరకు హర్యానా రాష్ట్రం, కర్నాల్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో తమ విద్యార్థి రజత పతకం సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. జాతీయ స్థాయి యోగాలో ప్రతిభ కనబరిచిన దేవాన్ష నాయుడును విద్యా సంస్థల అధినేత సిహెచ్ వి కె నరసింహారావు, వైస్ ప్రిన్సిపల్ ఎమ్ అపర్ణ, యోగా గురువు సురేష్ తదితరులు అభినందించారు.


కొత్తకోటలో నిరీక్షిస్తున్న రైతులు

యూరియా కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రావికమతం మండలంలో గురువారం కొత్తకోట, మేడివాడ పిఏసిఎస్, గుడివాడ వద్ద రైతులు భారీ స్థాయిలో బారులు తీరారు. మూడు చోట్ల రైతుల మధ్య తోపులాటలు జరగడంతో కొత్తకోట, రావికమతం పోలీసులు, వ్యవసాయ అధికారులు రైతులకు సర్ది చెప్పి ఒక్కొక్క యూరియా బస్తాను అందజేశారు.

ఉపాధి హామీలో మార్పులకు శ్రీకారం

ప్రజాశక్తి -మాడుగుల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నూతన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల పరిషత్ అధికారి గోపాలరావు పేర్కొన్నారు. స్థానిక తులసీ కళ్యాణ మండపంలో గురువారం మాడుగుల క్లస్టర్ పరిధిలో గల ఆరు మండలాల ఏపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, ఎఫ్ఏ లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు గాను ప్రభుత్వం నూతన విధానాలు అమల్లోకి తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. ఏపీడి బి శ్రీనివాసరావు మాట్లాడుతూ పనులకు వచ్చే కూలీలకు ఫేస్ వల్ యాపు పెట్టనున్నారని తెలిపారు. పనులు గుర్తింపులో కూడా యుక్తి యాప్ ద్వారా గుర్తించడం జరుగుతుందని చెప్పారు. ఉపాధి శ్రామికులకు ఐరీస్ ద్వారా హాజరు తీసుకోవడము జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మురళీకృష్ణ, ఏ పీ ఓ లు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపాలరావు

సంపద కేంద్రాన్ని పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: సంపద కేంద్రాల నిర్వహణ పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో వేంపాడులో గురువారం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చు కోవాలన్నారు.

మెడికల్ కాలేజీ పిపిపి విధానంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మెడికల్ కళాశాలపై కూటమి ప్రభుత్వం తీసుకున్న పిపిపి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టారు.ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయినప్పటికీ ఎమ్మెల్యే గణేష్ ప్లే కార్డుల ప్రదర్శిస్తూ మెడికల్ కళాశాల ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేతో సహా నాయకులందరిని అదుపులోకి తీసుకున్నారు. నర్సీపట్నం నుండి ఆయనను మాకవరపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించి విడుదల చేశారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

కోటవురట్ల: మెడికల్ కాలేజీ నిర్వహణ ప్రైవేటు పరం చేయకూడదంటూ శాంతియుత ధర్నా చేపడుతుంటే నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడకక్కడ వైసిపి నాయకులను అక్రమ అరెస్టు చేసి మాకవరపాలెం తీసుకురావడం తగదని మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ అన్నారు, ఇటువంటి అరెస్టులకు భయపడేది లేదని, ప్రజల కోసం ప్రజా శ్రేయస్సు కోసం పోరాడుతుంటే కూటమి ప్రభుత్వం నీచమైన రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. 500 కోట్లతో నిర్మాణం చేపడుతున్న కాలేజీని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడం తగదన్నారు.


మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

వేతన బకాయిలు చెల్లించాలని ఏటికొప్పాక సుగర్స్ కార్మికుల ఆందోళన


ఆందోళన చేపడుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -యస్ రాయవరం: మండలంలో దార్లపూడి గ్రామంలో ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన ఆయన మాట్లాడుతూ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ మూతబడి ఐదేళ్లు కావస్తున్నా కార్మికులకు రావలిసిన జీతం బకాయిలు నేటికీ చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి ఉన్న నియోజకవర్గంలోనే ఇటువంటి పరిస్థితి నెలకొందన్నారు. ఆసియాలోనే మొట్టమొదటి సహకార సంఘం షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వాల దుర్మార్గమైన విధానాలతో మూసివేసారని, దీంతో వేలాదిమంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. చెరుకును పండించే వారంతా వ్యవసాయానికి దూరమై రోజు కూలీలుగా మారారని తెలిపారు.సొంత నియోజకవర్గంలో రైతులు, కార్మికులు ఆకలితో అలమటిస్తుంటే హోం మంత్రికి చీమకుట్టి అయినా లేదన్నారు.ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్, అనితలు మూడు నెలల్లో కార్మికుల బకాయిలన్నీ చెల్లిస్తామని వాగ్దానం చేసి 15 నెలలు దాటినా అమలు కాలేదని విమర్శించారు.

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, షుగర్ ఫ్యాక్టరీ మూతపడడంతో 15 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కార్మికుల కుటుంబాలన్నీ ఆకలితో అలమటిస్తు న్నాయని, అయినా వారి బాధలు కనిపించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కరెడ్ల సత్యనారాయణ, రాయవరపు హనుమంతరావు, జి గోవిందరావు, ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి-నక్కపల్లి: పదవ తరగతి పరీక్షలలో ప్రతి పాఠశాల నుండి శాతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్జేడి .బి. విజయ భాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్జేడి విజయ భాస్కర్ మాట్లాడుతూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి స్నేహపూర్వకమైన వాతావరణంలో వారికి బోధించి ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. ప్రాథమిక స్థాయి నుండే పిల్లలకు చదవడం వ్రాయడంపై దృష్టి సారించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఓర్పు కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ప్రతీపాఠశాలను సందర్శించి మోనిటరింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు, ఎంఇ ఓ లు కే నరేష్, రుత్తల నాగన్నదొర పాల్గొన్నారు.బిఆర్ అంబేద్కర్ గురుకులంను ఆకస్మికంగా సందర్శించి, వంటగది, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు, 10వ తరగతి నోట్ పుస్తకాలు, విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలు, ఉపాధ్యాయుల పిఎం ఆర్, సిఎం ఆర్‌లను తనిఖీ చేశారు.


మాట్లాతున్న విజయభాస్కర్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి ఎంపిక

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు కప్పల ప్రసాద్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీ ఎంపికల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని పి. వైష్ణవి ప్రతిభ కనబర్చి ఈ నెల 22, 23, 24 తేదీలలో విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడానికి అవకాశం దక్కించుకోవడం ఎంతో ఆనందకరంగా ఉందని తెలిపారు. వైష్ణవి ని ఫిజికల్ డైరెక్టర్ కే.అమ్మోరయ్య , స్థానిక నాయకులు అభినందించారు.